www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 20 మార్చి 2025

5

పశ్చిమ గోదావరి

'స్వయం ఉపాధి'కి దరఖాస్తులు ఆహ్వానం

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

వెనుకబడిన తరగతులకు చెందిన యువత నుంచి స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు బిసి-ఎ, బిసి-బి, బిసి-డి, బిసి-ఇ, ఇడబ్ల్యూఎస్ తరగతుల వారి నుంచి జనరిక్ ఫార్మసీలు, ఎంఎస్ఎంఇ యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న అర్హులైన లబ్ధిదారులు https://apobmms.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 22వ తేదీలోపుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అదనపు సాయం.. అసంపూర్ణం..!

అసంపూర్తిగా నిలిచిన పేదల ఇళ్ల నిర్మాణం పూర్తికి కూటమి ప్రభుత్వం అదనపు సాయం ప్రకటించింది. అయితే ఇది అరకొర సాయం అంటూ లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. రూ.50 వేలు ఆర్థిక సాయం ఏమూలకూ సరిపోదని, కనీసంగా రూ.రెండు లక్షలైనా ఇస్తేనే ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని ఘంటాపథంగా చెబుతున్నారు.

- ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయంపై లబ్ధిదారుల పెదవివిరుపు
- అధికారుల ఒత్తిడితో కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణ పనులు పునఃప్రారంభం
- ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్
- లేనిపక్షంలో ఇంటికి రూ.2 లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం ఏ రూపంలోనైనా రూ.1.80 లక్షలు మంజూరు చేసేది. వాస్తవంగా ఒక సాధారణ ఇంటి నిర్మాణానికి ఏడు నుంచి పది లక్షల రూపాయల వరకూ ఖర్చవుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా మధ్యలో నిలిచిపోయిన ఇళ్లకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ అదనపు సాయం ప్రకటించింది. దీనిలో బిసిలు, ఎస్‌సిలకైతే రూ.50 వేలు, ఎస్‌టిలకైతే రూ.75 వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష చొప్పున అదనపు సాయం ప్రకటించింది. పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 18,340 మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో నిలిచిపోయినట్లు గుర్తించారు. ఏలూరు జిల్లాలో ఈ సంఖ్య సుమారు 49,436గా గుర్తించారు. అంటే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 67,776 గృహాల లబ్ధిదారులకు అదనపు సాయం అందే అవకాశం ఉంది. అయితే అదనపు సాయం అందే లబ్ధిదారుల్లో పశ్చిమగోదావరి జిల్లాలో బిసిలు 12,362, ఎస్‌సిలు 5,593, ఎస్‌టిలు 385 మంది ఉండగా, ఏలూరు జిల్లాలో బిసిలు 27,150, ఎస్‌సిలు 18,452, ఎస్‌టిలు 3,293, ఆదివాసీ గిరిజనులు 541 మందిగా గుర్తించారు. అయితే వీరు తమ ఇళ్ల నిర్మాణం వచ్చే ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేసుకుంటేనే అదనపు సాయం లభిస్తుందనే నిబంధన విధించారు. ఆ సొమ్ము కూడా ఒక్కసారిగా కాకుండా ఇంటి నిర్మాణ దశలను బట్టి విడతలవారీ లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం ప్రభుత్వం తీరు చూస్తే మరోసారి ఇళ్ల నిర్మాణానికి ఉసికొల్పి అప్పుల ఊబిలోకి దింపేలా ఉందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పునాది స్థాయి నుంచి శ్లాబ్ వరకూ వివిధ స్థాయిలో ఆయా ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి ఉంది. పునాది దశ నుంచి శ్లాబ్ దశలోపు నిలిచిన ఇళ్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.50 వేలు ఐరన్ కొనుగోలుకే ఏమూలకూ సరిపోవని, ఇక ఇసుక, ఇటుకలు, సిమెంట్, మెటల్, భవన నిర్మాణ కూలీలకు సొమ్ము ఎక్కడ నుంచి తీసుకురావాలని నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం సొమ్ము బల్క్‌గా ఇచ్చినా ఎంతోకొంత అప్పు చేసైనా ఇంటి పనులు కొలిక్కి తెచ్చుకునే అవకాశాలుంటాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, లేదా ప్రభుత్వమే ఇళు నిర్మించి ఇవ్వాలని సిపిఎం చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. గత వైసిపి ప్రభుత్వం ఈ డిమాండ్‌ను పెడచెవిన పెట్టింది. దీంతో జగనన్న కాలనీలన్నీ తుప్పలతో నిండిపోయాయి. కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించుకున్నా కనీస సౌకర్యాలు లేకపోవడంతో నివాసం ఉండేందుకు నానావస్థలు పడుతున్నారు. తాజాగా రెండు జిల్లాల్లో సిపిఎం నిర్వహిస్తున్న ప్రజాచైతన్య యాత్రల్లో కాలనీల్లో వసతుల లేమి సమస్యే పెద్దఎత్తున తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనైనా ప్రభుత్వం పున పరిశీలించి నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణానికి కనీసంగా రూ.2 లక్షల వరకూ సాయం అందించాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే ఆ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అలాగైతేనే కూటమి ప్రభుత్వం అందించే అదనపు సాయం ఫలితమిచ్చి ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని, లేనిపక్షంలో శ్లాబ్ దశ దాటిన ఇళ్లు మాత్రమే పూర్తయ్యే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచిస్తుందో.. లేదో వేచిచూడాలి.

కౌలురైతులకు కొత్త చట్టం వెంటనే తీసుకురావాలి

ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కౌలు రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి - ఆచంట

భూయజమానులతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చేలా కొత్త కౌలుచట్టాన్ని వెంటనే తీసుకురావాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. కౌలు చట్టాన్ని వెంటనే ఆమోదించాలని కోరుతూ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ జి.కనకరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన భూయజమానులు సంతకం చేస్తేనే కౌలుకార్డులు ఇవ్వాలనే నిబంధనలు తొలగించి, రాష్ట్ర ప్రభుత్వమే కౌలురైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇచ్చేలా నూతన కౌలురైతుల చట్టాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. పంట నమోదు కౌలురైతుల పేరున చేసి పంట రుణాలు, నష్ట పరిహారం కౌలురైతులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యాన సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేవారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు కృషి చేస్తానని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో నేత కేతా పూర్ణారావు, కౌలురైతులు కొండేటి సత్యనారాయణ, బండి రంగారావు, కేతా మోహన్‌రావు, బండి శ్రీనివాసు, కుడిపూడి శ్రీనివాస్, కేతా ఆదినారాయణ, ప్రజా సంఘాల నాయకులు పి.మోహన్‌రావు, తోటపల్లి సత్యనారాయణ, సిర్రా నర్శింమూర్తి, బొర్రా ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సునీత విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఐద్వా నేత సరిపల్లి జయప్రభ

యలమంచిలి మండలం చించినాడలో..



నరసాపురంలో..

ప్రజాశక్తి - యలమంచిలి

మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన సునీత విలియమ్స్ సాహసం మహిళా లోకానికి ఆదర్శనీయమని ఐద్వా జిల్లా నేత సరిపల్లి జయప్రభ అన్నారు. బుధవారం చించినాడ గ్రామంలో మహిళా సంఘం సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యాలయం సెంటర్ వద్ద జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ సునీత విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకొని మహిళలంతా ఆకాశంలో సగం అవకాశాల్లో సగం అంటూ మహిళలు తమ శక్తిసామర్థ్యాలతో అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా దూసుకుపోతూ సంపూర్ణ మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి జిల్లెల్ల ప్రశాంతి, ఐద్వా మండల నేతలు గొల్ల విజయకుమారి, చెట్టిమి నాగమణి, ముస్కూడి జయశ్రీ, గొల్ల మార్తమ్మ పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : సునీత విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు తెలిపారు. అనాకోడేరులో డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. సునీత విలియమ్స్ సాహసం, ధైర్యాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్న బాబు మాట్లాడుతూ ఆమె కృషి, పట్టుదలను గ్రహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంవి.శ్రీలక్ష్మి, డి.అనూరాధ, వై.శకుంతల, ఎం.బాల, పల్లాల రాజు పాల్గొన్నారు.

నరసాపురం: తొమ్మిది నెలల తరువాత అంతరిక్షం నుండి భూమిపైకి దిగొచ్చిన సునీత విలియమ్స్ బృందానికి ఐద్వా జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని రుస్తుంబాదలో ఐద్వా నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారని చెప్పటానికి సునీత విలియమ్స్ పెద్ద నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో భారతి, కొండ, నాగలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నోటీసులు అందించాలి

జాయింట్ కలెక్టర రాహుల్‌కుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిన గ్రామాల్లోని రైతులకు 9(2) నోటీసులను అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో రీసర్వే, ఆర్ఒఆర్, ఇనాం ఎస్టేట్, ల్యాండ్ గ్రౌండింగ్, వెబ్‌ల్యాండ్ తదితర అంశాల పురోగతిపై జిల్లాలోని ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లతో జాయింట్ కలెక్టర్ గూగుల్‌మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రీ సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిన 13 గ్రామాల్లో రైతులకు 9(2) నోటీసులను అందజేయాలని సంబంధిత శాఖ అధికారులును ఆదేశించారు. ఏఒక్క రైతుకూ తన భూమికి సంబంధించి నోటీసులు అందలేదని ఫిర్యాదులు రాకూడదన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ పనులు జరుగుతున్న ఏడు గ్రామాల్లోనూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్.రవికుమార్, డిటిలు ఎం.సన్యాసిరావు, జీవనరాణి, ఇడిఎం ఎం.కిరణ్ పాల్గొన్నారు.



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని, కిడ్నీ పేషెంట్లకు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, గర్భిణులకు స్కానింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ప్రభుత్వాసుపత్రి వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ తీర ప్రాంతంలో ప్రధానంగా ఉన్న ఏరియా ఆసుపత్రిలో వందలాది మంది గర్భిణులు ప్రసవానికి వస్తుంటారన్నారు. వారికి పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఇక్కడ చేయకపోవడం వల్ల ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందని, దీనికి సుమారు రూ.25 వేల వరకూ ఖర్చవుతుందని తెలిపారు. తీర ప్రాంతంలో కిడ్నీ పేషెంట్లు పెరుగుతున్నారన్నారు. వీరికి డయాలసిస్ చేయించుకోవడానికి డయాలసిస్ సెంటర్ ఏర్పాట చేయాలని విజ్ఞప్తి చేశారు. గర్భిణుల అవసరార్థం స్కానింగ్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. అన్ని రకాల రోగాలకు వైద్యులను నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను ఏరియా హాస్పటల్ ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సుప్రియకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు పి.పూర్ణ, మంచిలి నీలకంఠం, పి.నారాయణరావు, బి.జోగేశ్వరరావు, కడలి రవి, గుబ్బల నాగేశ్వరరావు, కటెం నరేష్, చింతపల్లి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'రిజిస్ట్రేషన్లపై సిఐడి విచారణ చేపట్టాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన సుమారు మూడు వేల రిజిస్ట్రేషన్లపై సిఐడి విచారణ చేపట్టాలని మొగల్తూరు లేఖరుల సంఘం అధ్యక్షుడు కొల్లాటి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. మొగల్తూరులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల అవసరాలను ఆసరాగా తీసుకుని కొంతమంది దళారులు ప్రభుత్వమిచ్చిన పట్టా భూములు, అసైన్డ్, పోరంబోకు స్థలాలకు ఆర్ఎస్ నెంబర్లను మార్చి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ రిజిస్ట్రేషన్ల కోసం ఇతర జిల్లాల నుండి మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తున్నారని అన్నారు. దీనిలో బ్యాంక్ అధికారులు, దళారులు, సబ్ రిజిస్ట్రారు, లేఖర్లుగా చెప్పుకుంటున్న పలువురి పాత్ర కూడా ఉందని ఆయన అన్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన పలువురు సబ్ రిజిస్ట్రార్లు అవినీతి ఆరోపణలతో సస్పెండైనా కొత్తగా వచ్చినవారి ఆలోచనల్లో మార్పు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ల నివారణకు ప్రభుత్వం లేఖర్లకు లైసెన్సులు జారీ చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని, లైసెన్సులు పొందిన లేఖర్లు అవినీతికి పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు తగు నిబంధనలను రూపొందించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘ మండల కార్యదర్శి శీలబోయిన సత్యనారాయణ, కడలి త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

జీవన్ ప్రమాణ్ పత్రాలు మాన్యువల్‌గా ఆమోదించాలి

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

జిల్లా ఖజానాధికారి గణేష్ తో మాట్లాడుతున్న ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు

ప్రజాశక్తి - భీమవరం

జీవన్ ప్రమాణ పత్రాలు మాన్యువల్‌గా తీసుకుని ఆమోదించాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాతల జేమ్స్, సాగిరాజు సత్యనారాయణరాజు కోరారు. బుధవారం స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయానికి వార్షిక తనిఖీ నిమిత్తం విచ్చేసిన జిల్లా ఖజానా అధికారి ఎ.గణేష్‌ను రిటైర్డ్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటివరకు జీవన్ ప్రమాణ సమర్పించని పెన్షనర్ల జీవన ధ్రువీకరణ పత్రాలను మాన్యువల్‌గా తీసుకుని ఆమోదించాలని కోరారు. అలాగే మంచంపై ఉన్నవారికి జీవన్‌ప్రమాణ పత్రాలు సమర్పించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన జిల్లా ఖజానాధికారి గణేష్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సంఘం కోశాధికారి బివి.రవిప్రసాద్, భీమవరం యూనిట్ అధ్యక్షులు ఎన్ఎస్ఎస్.పాల్, ట్రెజరర్ పివిఆర్ఎస్.సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కరరావు, సభ్యులు అప్పన సత్యనారాయణ, కె.రామారావు, ఆర్.సూర్యనారాయణ, కె.చంద్రరావు, అప్పారావు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - యలమంచిలి

మానవాళి మనుగడకు ఎంతో ప్రయోజనం చేకూర్చే మొక్కలను ప్రతి ఒక్కరూ నాటాలని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్రలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆర్‌డిఒ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రకృతి ఆహ్లాదాన్ని పంచడమే కాకుండా వీటి ద్వారా ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయని, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ఇంటికొక మొక్క నాటే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గ్రంధి పవన్‌కుమార్, కార్యాలయ సిబ్బంది, విఆర్‌లు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నేతలు

ఎస్‌సి వర్గీకరణ నిలిపివేయాలని నిరసన

ప్రజాశక్తి - ఆచంట

ఎస్‌సి వర్గీకరణ నిలిపివేయాలని కోరుతూ స్థానిక పెదపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాలసంఘాల జెఎసి ఆధ్వర్యాన బుధవారం నిరసన చేపట్టారు. తొలుత సంఘాల నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీరా మధు, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు మాల, మాదిగల మధ్య వర్గీకరణ చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఉల్లం రామానుజం, దబ్బా ప్రకాష్, అంద్రు లక్ష్మణ్, నక్కా ప్రియ, మట్టా చంటి, కారేం చినబాబు, పారుపల్లి సురేష్, బొంతు శ్రీను, పుచ్చకాయల నాగార్జున, మెండే శ్రీను, తరపట్ల శ్రీను, జల్లి అంద్రియ్య, నేలపాటి రమణ, కోట గిరిధర్, డోల్లా ప్రసాద్, బద్దె ఇశ్రాయేలురాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ

శక్తి బృందాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా ప్రవేశపెట్టిన శక్తి యాప్, మహిళలకు ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ శక్తి బృందాలను డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు మేరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుధవారం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో శక్తి బృందాల టీములను ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి జిల్లా వ్యాప్తంగా 30 మంది సిబ్బందితో ఐదు శక్తి బృందాలను ఏర్పాటు చేశారు. శక్తి బృందాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి వారు చేయాల్సిన విధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్‌టిసి బస్టాండ్లు, ముఖ్య కూడళ్లలో నిఘా ఉంటుందని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఐదు బృందాలు ప్రధాన కార్యాలయం -2, భీమవరం-1, నర్సాపురం-1, తాడేపల్లిగూడెం -1 సబ్ డివిజన్లలో విధులు నిర్వహిస్తారన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్‌నకు వచ్చే ఎస్ఒఎస్ కాల్స్, డయల్ 112/100 కాల్స్‌తో సంఘటనా స్థలానికి ఈ టీములు వెళ్తాయన్నారు. కాల్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చూస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డిఎస్‌పి ఎంవివి.సత్యనారాయణ, డిఎస్‌పి రావూరి గణేష్ జయసూర్య, నరసాపురం డిఎస్‌ఫి శ్రీవేద, పోలీసులు పాల్గొన్నారు.

ఫోన్ పోతే వాట్సప్‌లో ఫిర్యాదు చేయండి

చోరీకి గురైన, లేక చేజార్చుకున్న సుమారు రూ.23 లక్షల విలువైన 155 సెల్‌పోన్లను రికవరీ చేశామని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ తెలిపారు. బుధవారం ఎస్‌పి కార్యాలయంలో ఇటీవల సెల్ ఫోన్లు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసిన వారికి రికవరీ చేసిన సెల్ ఫోన్లను ఎస్‌పి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,394 సెల్ ఫోన్ల రికవరీ చేశామని, వీటి విలువ సుమారు 2,09,10,000 ఉంటుందని తెలిపారు. ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఇంటి వద్దనే కూర్చొని 9154966503 వాట్సప్ నంబర్‌కు హాయ్ లేదా హెల్ప్ యు అని మెసెజ్ చేసి, వచ్చిన లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో మొబైల్ ఫోన్‌కు సంబంధించిన వివరాలు నింపితే చాలు పోగొట్టుకున్న మీ మొబైల్‌ని రికవరీ చేసి మీకు అందిస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డిఎస్‌పి ఎంవివి.సత్యనారాయణ, భీమవరం సబ్ డివిజన్ డిఎస్‌పి రావూరి గణేష్ జయసూర్య, నరసాపురం డిఎస్‌పి జి.శ్రీవేద, తాడేపల్లి గూడెం సబ్ డివిజన్ డిఎస్‌పి డి.విశ్వనాథ్ పాల్గొన్నారు.

నవుడూరు సెంటర్లో ఆక్రమణల తొలగింపు

నవుడూరు సెంటర్లో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - వీరవాసరం

నవుడూరు సెంటర్లో ఆర్అండ్‌బి రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలను ఎట్టకేలకు తొలగించే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో కొంతమంది ఆర్అండ్‌బి రోడ్డు మార్గాన్ని ఆక్రమించుకొని వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఆక్రమణల వల్ల కొంతకాలంగా ఇక్కడ ట్రాఫిక్ ఏర్పడి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇబ్బందులు తొలగించాలంటూ అనేకమంది అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో భాగంగా అటు ఆక్రమణదారులు, ఆర్అండ్‌బి శాఖాధికారులు కోర్టును ఆశ్రయించారు. ఆక్రమణదారులకు అనుకూలంగా హైకోర్టు కొంతకాలం స్టే విధించినప్పటికీ ఆర్అండ్‌బి అధికారులు వాదనలతో ఏకీభవించిన హైకోర్టు ఆక్రమణలను తొలగించాలంటూ ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో సంవత్సర కాలంగా ఆక్రమణల తొలగింపు కొన్ని కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. చివరికి ఆక్రమణల తొలగింపునకు తీసుకోవాల్సిన అన్ని ముందస్తు చర్యలూ నవుడూరు పంచాయతీ అధికారులు ఆర్అండ్‌బి అధికారులు తీసుకోవడంతో ఆక్రమ తొలగింపునకు ఎటువంటి అడ్డంకులు లేకుండా తొలగించే ప్రక్రియ చేపట్టారు. వీరవాసరం ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ బందోబస్తు మధ్య ఆర్అండ్‌బి అధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శి మాణిక్యం, ఇతర పంచాయతీరాజ్ శాఖ అధికారుల సమక్షంలో ఆక్రమణల తొలగింపు జరుగుతోంది.

పది పరీక్షకు 497 మంది హాజరు

ప్రజాశక్తి - పెనుమంట్ర

బుధవారం మండలంలోని నాలుగు కేంద్రాల్లో జరుగుతున్న పది పరీక్షల నేపథ్యంలో 504 మంది విద్యార్థులకు గాను 497 మంది హాజరయ్యారని ఎంఇఒలు వై.లక్ష్మీనారాయణ, యు.నాగేశ్వరరావు తెలిపారు. పొలమూరు జడ్‌పి హైస్కూల్‌లో 70 మందికి 69 మంది, మార్టేరు ఎస్‌విజిజడ్‌పి హైస్కూల్లో 199 మందికి 195 మంది, మార్టేరు బిడి జెడ్‌పి గర్ల్స్ హైస్కూల్లో 68 మందికి 67 మంది, పెనుమంట్ర ఆర్‌ఎజెడ్‌పి హైస్కూల్లో 167 మందికి 166 మంది హాజరయ్యారని తెలిపారు. మొత్తం 504 మందికి 497 మంది హాజరు కాగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో బుధవారం హిందీ పరీక్షకు 790 మంది విద్యార్థులకు గాను 777 మంది హాజరయ్యారని ఎంఇఒ యూత్ శామ్యూల్ జాన్ తెలిపారు. మొగల్తూరులో ముగ్గురు, కెపి.పాలెంలో ముగ్గురు, ముత్యాలపల్లిలో ఐదుగురు, శేరేపాలెంలో ఒకరు, జగన్నాథపురంలో ఒకరు పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు.

నరసాపురం : పది పరీక్షల్లో భాగంగా రెండో రోజు బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. హిందీ పరీక్షకు పట్టణ, మండలంలోని ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,735 మంది రెగ్యులర్, ప్రయివేటు విద్యార్థులకు 1696 హాజరవ్వగా 36 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

చేనేతపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలకు, మర మగ్గాలకు ఉచిత విద్యుత్ విధానంపై ప్రభుత్వ నిర్ణయం హర్షదాయకమని దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాజకీయ విభాగాల రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లాడ సూర్య భాస్కరరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, సవితకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధికి విద్యుత్ విధానం ఒక నిదర్శనమన్నారు.

నరసాపురం : చేనేతకు ఊతమిస్తూ ప్రభుత్వం ఉచిత విద్యుత్ విధానాన్ని ప్రకటించడం పట్ల జాతీయ చేనేత ఐక్యవేదిక నరసాపురం అధ్యక్షులు, టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి మావూరి ఆనంద్ కుమార్ వర్షం వ్యక్తంచేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని చేనేత జీవితాల్లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు.

బొండాడలో అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

బొండాడ గ్రామంలోని గ్రామ దేవతలు పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయ 50వ వార్షిక జాతర మహోత్సవాల సందర్భంగా అన్నసమారాధన బుధవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేల మంది యాత్రికులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బొండాడ, బొండాడ పేట, ఎల్ఎన్.పురం, జక్కరం, కోపల్లె, పెదఅమిరం, సీసలి గ్రామాల నుండి యాత్రికులు అధిక సంఖ్యలో అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు మందపాటి కృష్ణ మూర్తి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వేగేశ్న ఆంజనేయరాజు, జెడ్‌పిటిసి పి.సోమేశ్వరరావు, సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, గోకరాజు శివబాబు, గొర్ల లక్ష్మణస్వామి, మేకా వెంకన్నబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని కోట రోడ్డులోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం భారీ అన్న సమారాధన చేశారు. ఇటీవల అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెదేపా నరసాపురం నియోజకవర్గం ఇన్చార్జి పొత్తూరి రామరాజు , ఆ పార్టీ మొగల్తూరు మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు మాజీ ఎంపీపీ కత్తిమండ ముత్యాలరావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

గణపవరం:కొత్తపల్లి గ్రామంలో వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి డి.రామాంజనేయులు బుధ వారం తెలిపారు. ఫిల్టర్ బెడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి ఇసుక మార్చామని తెలిపారు. తాగునీరు రంగు మారకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. తాగునీటి చెరువులో బ్లీచింగ్ కలిపి ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉదయశ్రీ పాల్గొన్నారు.

కాళ్లకూరు హుండి లెక్కింపు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ళకూరులో వెంకటేశ్వరస్వామికి యాత్రికులు సమర్పించిన కానుకలను బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు వర్ధినీడి వెంకటేశ్వరరావు, ఆలయ డిప్యూటీ కమిషనర్, ఇఒ ఎం.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ, కాళ్లకూరు గ్రామస్తులు, యాత్రికులు, మహిళా మండలి సభ్యులు సమక్షంలో హుండి లెక్కింపు నిర్వహించారు. 58 రోజులకు హుండీ లెక్కింపు నిర్వహించగా రూ.13.74 లక్షల ఆదాయం వచ్చింది.

ఎన్‌సిడిసిడి సర్వే పెరగాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది చేస్తున్న ఎన్‌సిడిసిడి సర్వే పెరగాలని బుధవారం జరిగిన జూమ్ సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి ఆదేశాలిచ్చినట్లు డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. జూమ్ ప్రాథమిక రివ్యూలో ప్రతి ప్రోగ్రాం నూరు శాతం పూర్తి చేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే విధంగా కృషి చేయాలని చెప్పారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఒలు

సచివాలయాల్లో హేతుబద్ధీకరణ నిలిపివేయాలి

తహశీల్దార్‌కు విఆర్‌ఒల వినతి

ఉండి:గ్రామ వార్డు సచివాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా హేతుబద్ధీకరణ తీసుకురావడం వల్ల తమపై పని భారం మరింత పెరుగుతుందని విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షులు సైలాడ చిన్నారావు అన్నారు. బుధవారం సాయంత్రం తహశీల్దార్ కావడి నాగార్జునకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చే క్లస్టర్ విధానం వల్ల రెండు సచివాలయాలకు ఒక విఆర్‌ఒ పనిచేయాలని, దీనివల్ల అదనపు భారం తప్పదని, దీనివల్ల విఆర్‌ఒలు ఒత్తిడికి లోనై ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని వివరించారు. ఇప్పటికే సర్వేల పేరుతో తమను ఇబ్బందులకు గురి చేసినప్పటికీ తప్పని పరిస్థితిలో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్లస్టర్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. వినతి పత్రం అందించిన వారిలో విఆర్‌ఒలు ఉన్నారు.

ప్రత్యేక మొబైల్ ఆధార్ నమోదు ప్రారంభం

పెనుమంట్ర:మండలంలోని మొబైల్ ఆధార్ నమోదు ప్రక్రియ బుధవారం జుత్తిగ, భట్లమగటూరు, ఓడూరు గ్రామ సచివాలయాల్లో ప్రారంభమైందని గురువారం కూడా నమోదు ఉంటుందని ఎంపిడిఒ పి.సామ్యూల్ తెలిపారు. 0 నుంచి 5 సంవత్సరాల మధ్య జనన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండి, నూతన ఆధార్ కార్డు నమోదు చేయాల్సిన పిల్లలు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. 5 సంవత్సరాల నుండి 7 సంవత్సరాల మధ్య జరగాల్సిన మొదటి మాండేటరీ బయో మెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాల్సిన పిల్లలు, 15 నుండి 17 సంవత్సరాల మధ్యలో జరగాల్సిన రెండో మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాల్సిన పిల్లలు వీరంతా తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు.

లబ్ధిదారులు ఇకెవైసి చేయించుకోవాలి

ఆచంట:పెండింగ్ రేషన్ లబ్ధిదారులు అందరూ విధిగా ఆయా రేషన్ డిపోల వద్దకెళ్లి ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ జి కనకరాజు తెలిపారు. మండలంలోని ఆయా రేషన్ డిపోల వారీగా ఇకెవైసి పెండింగ్ జాబితాలు రేషన్ డిపోల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నెలాఖరులోపు పెండింగ్ జాబితాల ప్రక్రియ పూర్తి చేయాలని డీలర్లను ఆదేశించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

జూన్ నెలాఖరుకు 213 గృహాల నిర్మాణమే లక్ష్యం

పాలకోడేరు హౌసింగ్ ఎఇ నరసింహారావు

ప్రజాశక్తి - పాలకోడేరు



జూన్ నెలాఖరు నాటికి మండలంలో 213 గృహ నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా తీసుకున్నట్లు పాలకోడేరు హౌసింగ్ ఎఇ బివి.నరసింహారావు తెలిపారు. ఇప్పటికే గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అన్ని విధాలా చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ప్రతి లబ్ధిదారుడూ గృహం నిర్మించుకునే విధంగా వారికి అవగాహన కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రజాశక్తి నిర్వహించిన చిట్‌చాట్‌లో హౌసింగ్ ఎఇ నరసింహారావు వివరాలు వెల్లడించారు.

చిట్ చాట్

ప్రశ్న : మండలంలో 213 గృహ నిర్మాణాలే లక్ష్యంగా తీసుకోవడానికి కారణం ఏమిటి?

ఎఇ : రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుంది. దీనిలో భాగంగా జిల్లాలో సుమారు 7 వేల నిర్మాణాలు లక్ష్యంగా తీసుకోగా మండలానికి వాటాగా 213 గృహాలు వాటాగా వచ్చాయి. 14 గ్రామాల్లో 340 గృహాలు నిర్మించాలనుకున్నాం. ఇప్పటివరకూ 169 గృహాలు గుమ్మాల దశలో ఉన్నాయి. 7 గృహాలకు స్లాబ్ దశ పూర్తయ్యింది. మరో 164 స్లాబ్ దశలో ఉన్నాయి. మూడు నెలల్లో 213 గృహాలు నిర్మించాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

ప్రశ్న : పిఎంఎవై 2.0 పథకంలో ఇప్పటివరకూ ఎన్ని దరఖాస్తులు అందాయి?

ఎఇ : గృహం కావాలని దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ మంజూరు చేయడం జరుగుతుంది. పిఎంఎవై 2.0 పథకంలో ఇప్పటివరకూ 83 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ గృహాలు మంజూరు చేశాం. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రశ్న : గతంలో గృహ నిర్మాణాలకు తీసుకున్న లక్ష్యం చేరుకున్నారా?

ఎఇ : గత ప్రభుత్వ హయాంలో 2,380 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా తీసుకున్నాం. కొంతమేర లక్ష్యం చేరుకోగలిగాం. సుమారు 1,041 గృహ నిర్మాణాలు పూర్తి చేశాం. 1,339 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి.

ప్రశ్న : ఎంత శాతం గృహ నిర్మాణాలు పూర్తి చేశారు?

ఎఇ : మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేఅవుట్లలో 1,782 గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకొచ్చారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే సొంత స్థలంలో 598 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకున్నారు. మొత్తం 59 శాతం గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి.

ప్రశ్న : ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు రుణ సాయం పెరిగే అవకాశం ఉందా?

ఎఇ : సొంతింటి కల నిజం చేసుకోవాలని అందరికీ ఉంటుంది. దీనికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోంది. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టిలంతా గృహాలు నిర్మించుకోవాలని ప్రభుత్వ ఆలోచన. రుణ సాయాన్ని పెంచే విధంగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. లబ్ధిదారుల గృహ నిర్మాణానికి ఈ సాయం ఎంతో మేలు చేకూర్చనుంది.

నూతన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం

ఆర్అండ్‌బి శాఖ డిఇ జి.వరలక్ష్మి

ప్రజాశక్తి - తణుకు రూరల్

కొత్త పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఆర్అండ్‌బి శాఖ డిఇ జి.వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. తణుకు ఆర్అండ్‌బి సబ్ డివిజన్ పరిధిలో రెండు నియోజకవర్గాలు ఉన్నాయని, ఈ పరిధిలో 467 కిలో మీటర్ల మేర రోడ్లు ఉన్నాయని తెలిపారు. తణుకు, ఇరగవరం, అత్తిలి, పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట మండలాలు నాలుగు సెక్షన్లుగా ఉన్నాయని, తణుకు, పెనుమంట్ర, పెనుగొండ, అత్తిలి సెక్షన్లకు గాను నలుగురు జెఇలు ఉండాలి అయితే ఇద్దరు మాత్రమే ఉన్నారని తెలిపారు. సిబ్బంది కొరత ఉందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన మిషన్ పాట్ హోల్ ఫిల్ కార్యక్రమం ద్వారా 13 వర్క్స్ కింద రూ.2 కోట్లతో 63.85 కిలో మీటర్ల మేర రోడ్లపై గుంతలు పూడ్చామని తెలిపారు. తణుకు నియోజకవర్గ పరిధిలో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు కొత్త పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ప్రధానంగా రెండు రోడ్ల నిర్మాణం, బ్రిడ్జిలు, కల్వర్టులు కలిపి 15 నూతన పనుల కోసం అంచనాలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ రెండు రోడ్లలో ఒకటి రాష్ట్రపతి రోడ్డు, రెండోది వేల్పూరు వెళ్లే రోడ్డు వీటి నిర్మాణం కోసం రూ.44 కోట్లు అంచనా వేశామని తెలిపారు. రాష్ట్రపతి రోడ్డులో గోస్తనీ నదిపై ఉన్న పెద్ద వంతెన శిథిలావస్థకు చేరడంతో నూతన వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని, వాలంటీర్ల జీతం 5000 రూపాయల నుంచి రూ.పది వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వైసిపి రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ కర్రా జయసరిత డిమాండ్ చేశారు. బుధవారం వైసిపి కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని టిడిపి నేతలు చెప్పారని అధికారం చేపట్టాక హామీ మర్చిపోయారని విమర్శించారు. వైసిపి సీనియర్ నాయకుడు జోగాడ ఉమా మహేశ్వరరావు, వెంకటేశ్వర స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ జోగి వెంకటేశ్వర రావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పిప్పర మార్కెట్ వేలం పాట

ప్రజాశక్తి - గణపవరం

పిప్పర మార్కెట్ వేలంపాట బుధవారం స్థానిక పంచాయతీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇఒపిఆర్‌డి పి.సత్యనారాయణ మాట్లాడుతూ వేలం పాటదారులు సకాలంలో సొమ్ములు చెల్లించాలన్నారు. పాటదారులు చెల్లించిన సొమ్ములతో పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ డైలీ మార్కెట్ రూ.రెండు లక్షల పది వేలకు, వీక్లి మార్కెట్ రూ.లక్షా ఎనభై వేలకు పాటదారులు పాడుకున్నట్లు తెలిపారు

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - నరసాపురం

బహుమతులు అందిస్తున్న ఆర్‌టిసి డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి

సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు, కళాశాల అధ్యాపకులకు, పాలిటెక్నిక్ విద్యార్థులకు కళాశాల అంతర్గత గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వివిధ విభాగాల్లో జనవరి 25 నుంచి మార్చి 18వ తేదీ వరకూ జరిగాయి. బాలుర విభాగంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, చెస్, బ్యాట్మింటన్, బాలికల విభాగంలో కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, చెస్ అలాగే అధ్యాపక బృందానికి క్రికెట్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్, మహిళా సిబ్బంది విభాగంలో క్యారమ్స్, బ్యాడ్మింటన్, చెస్ విభాగాల్లో గత 50 రోజుల నుండి పోటీలు నిర్వహించారు. బుధవారం బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా ఆర్‌టిసి డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి విచ్చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ప్రాధ్యాన్యతను వివరించారు. అనంతరం ముఖ్యఅతిథిని సన్మానించారు. కళాశాల నుంచి 2024-25 సంవత్సరానికి జెఎన్‌టియుకె సౌత్ జోన్‌కు వివిధ విభాగాల్లో బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్, మొదలగు విభాగాలకు ఎంపికైన విద్యార్థులు కెకె.రవితేజా రెడ్డి (బాస్కెట్ బాల్), డి.సునీత (టేబుల్ టెన్నిస్), డి.భీమేశ్వర్ (ఫుట్‌బాల్), కె.సంతోష్ (కరాటే)ను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపళ్లు, సిబ్బంది అభినందించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అమరావతి వద్ద జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ఈ వారిని కళాశాల యాజమాన్యం నగదు ప్రోత్సాహకాలు ఇచ్చి అభినందించారు. కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కళాశాల కోశాధికారి కెవి.స్వామి, డైరెక్టర్ ఎ.శ్రీహరి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

8 కేంద్రాల్లో 240 మందికి శిక్షణ

22న ఆకివీడులో భారీ జాబ్ మేళా

నైపుణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.లోకేమాన్

ప్రజాశక్తి - ఆకివీడు

జిల్లాలో ఎనిమిది కేంద్రాల్లో 240 మంది నిరుద్యోగ యువతీ యువకులు తమ సంస్థ ద్వారా సాంకేతిక వృత్తి శిక్షణ తర్ఫీదు పొందుతున్నారని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.లోకేమాన్ తెలిపారు. తమ సంస్థ కార్యకలాపాల్లో భాగంగా దుంపగడప డిగ్రీ కళాశాల, ఇక్కడ పనిచేస్తున్న తమ సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ సంస్థతో కలిసి ఈ నెల 22వ తేదీ శనివారం కళాశాలలో భారీ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎ.శారద కళాశాల ప్రణాళిక అభివృద్ధి విభాగం కార్యదర్శి పి.బలరాం ప్రతాప్‌కుమార్‌తో కలిసి బుధవారం కళాశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈ కళాశాలలో జరుగుతున్న మేళాలో 12 కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఏడో తరగతి నుండి ఎంఎ పాస్ అయిన వారి వరకూ అవకాశం ఉందన్నారు. వారితో పాటు ఐటిఐ, పాలిటెక్నిక్ ప్రొఫెషనల్ డిగ్రీ ఫార్మసీ తదితర కోర్సుల వారు సైతం ఈ ఇంటర్వ్యూలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. తమ సంస్థ ద్వారా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో మూడు నెలల పాటు 30 మంది చొప్పున వారి నైపుణ్యాన్ని మెరుగుపర్చే విధంగా ఒక్కొక్క శిక్షణా కేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. భీమవరం నియోజకవర్గంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిర్వహించే శిక్షణా కేంద్రంలో మందికి ఆఫీస్ అసిస్టెంట్ శిక్షణలో అందిస్తున్నామన్నారు. పాలకొల్లు దాసరి నారాయణరావు డిగ్రీ కళాశాలలో నిర్వహించే కేంద్రంలో గ్రాఫిక్స్ అండ్ డిజైనింగ్ అసిస్టెంట్ అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. నరసాపురంలో లీజు పార్కులో, ఆచంట తదితర కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పొందే వారికి ఉచిత భోజన వసతి సౌకర్యాలు అందిస్తామన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న వారు ఈ రోజుతో శిక్షణ పూర్తయిందని, త్వరలోనే మరో కొత్త బ్యాచ్ ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతి సెంటర్‌లోనూ నెలకు 1 చొప్పున శిక్షణ పొందిన వారి కోసం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎ.శారద, కళాశాల ప్రణాళిక అభివృద్ధి విభాగం కార్యదర్శి బలరాం, ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వమన్నాడని వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి - తణుకు

మద్యం షాపులో పనిచేస్తున్న సిర్రా పండు అనే వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తి ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద పాతవురుకు చెందిన సిర్రా పండు నైట్ పాయింట్లో మద్యం విక్రయిస్తున్నాడు. తెల్లవారుజాము రెండు గంటల ప్రాంతంలో గుర్తి తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి మద్యం కొనుగోలు చేశాడు. ఫోన్ పే ద్వారా డబ్బులు వచ్చాయా అని అడిగాడు. డబ్బులు రాలేదని, బండి ఇక్కడ పెట్టి డబ్బులు తెచ్చి ఇవ్వాలని పండు చెప్పాడు. ఆ వ్యక్తి బండి అక్కడే వదిలి కొంత దూరం వెళ్లి ఇనుప రాడ్డు తీసుకొచ్చి పండుపై దాడి చేశాడు. గాయపడిన పండును స్థానికులు తణుకులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. సిసి ఫుటేజ్ ఆధారంగా కేసు పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు - ఘోరాలు

కట్నం కోసం వేధింపులు

భర్త, అత్తమామలపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

కట్నం కోసం భార్యను వేధించడంతో ఆమె బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి గ్రామానికి చెందిన చిటికినీటి సత్యలక్ష్మి తిరుపతికి చెందిన వేంపల్లి వినోద్ కుమార్‌తో 10 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వివాహానంతరం కట్నం తేవాలంటూ వేధింపులు ప్రారంభమయ్యాయి. వేధింపులు భరించలేని సత్యలక్ష్మి ఉండికి చేరుకుని కుటుంబ సభ్యులు సాయంతో భర్త, అత్తమామలు నాగరాజు శ్రీదేవిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నం పడమరలో 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో గృహ యజమానులు ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ వారికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక వాహనంలో మైక్ ద్వారా బుధవారం ప్రచారం నిర్వహించారు. పన్నులు సకాలంలో చెల్లించకుంటే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు.

'టిడిపి సభ్యత్వంతో భరోసా'

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి సభ్యత్వంతో భరోసా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మొగల్తూరులో టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పార్టీ సభ్యత్వం స్వీకరించిన వారి కార్డులను క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లకు అందించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు. వచ్చేనెల మొదటి వారంలో గ్రామస్థాయి నుంచి నూతన కమిటీలు ఏర్పాటు కానున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావాలని ఆయన సూచించారు. నామినేషన్ పదవుల్లో 50శాతం టిడిపి శ్రేణులకు కేటాయించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కడలి వీర మోహన్‌రావు, కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్, మామిడిశెట్టి సత్యనారాయణ, సత్తినేని సర్వేశ్వరరావు, త్రినాథ్, డొల్ల రత్నంరాజు, విప్పర్తి వెంకటేశ్వరరావు, బళ్ల శ్రీను, పాలా రాంబాబు, నాగిడి రాంబాబు, కొల్లాటి భోగరాజు, కుక్కల వాసు, పంపన భగవాన్, కవురు నాగేశ్వరరావు, గుడాల శ్రీను పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డులు అందజేస్తున్న రామరాజు

దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయము - సత్రంపాడు, ఏలూరు.

పంచెలు, కండువాలు బహిరంగ వేలంపాట

ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు నగరం, సత్రంపాడులో వేంచేసి యున్న **శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయము** నందు శ్రీ స్వామి వారికి భక్తులచే సమర్పించబడిన పంచెలు, కండువాలను **ది.30-03-2025 ఆదివారము ఉదయం గం.9-00లకు** దేవస్థానము వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున బహిరంగ వేలం పాట ద్వారా అమ్మకమునకు పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

సత్రంపాడు, ఏలూరు. **కార్యనిర్వహణాధికారి,**

తేది.18-03-2025 **సెల్: 9948166689**

గ్రామపంచాయతి కార్యాలయం, చినతాడినాడ

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 01/2025 **తేది.18-03-2025**

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, చినతాడినాడ గ్రామ పంచాయితీ యందు 2025-26 సం॥నకు కాంట్రాక్ట్ లేబర్ పద్ధతిపై ఈ దిగువ తెలిపిన పనులు నిర్వహణకు గాను సీల్డు టెండర్లు ది. 28-03-2025 తేది ఉదయం 11.00 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం॥ 12-30 ని॥లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. మిగిలిన విషయములు ఈ కార్యాలయం పని వేళల యందు కోరి పొందవచ్చును.

వ.నెం.	పని వివరము	పని కాలము	ధరావత్తు
1	స్వీపర్	01-04-2025 నుండి 31-03-2026 వరకు అనగా ఒక సంవత్సర కాలం	రూ. 5000/- లేక సాల్వేన్సి

కార్యదర్శి వారి నోట్: గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. మరియు పంచాయితీ నిల్వలను బట్టి పేమెంట్ జరుపబడును.

సం/- **గండికోట ఏసుబాబు**
సర్పంచ్, చినతాడినాడ గ్రామపంచాయితీ
కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

సం/- **పి. రాంబాబు**
గ్రామపంచాయితీ కార్యదర్శి, చినతాడినాడ
కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

81 పశువులకు టీకాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని జగన్నాథపురంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించామని వైద్యురాలు జి.నీలిమ తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 81 పశువులకు వ్యాధి నివారణా టీకాలు వేశామని నీలిమ తెలిపారు.

టౌన్ ప్లానింగ్ లైసెన్సర్లతో సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో బుధవారం టౌన్ ప్లానింగ్ లైసెన్సర్‌లతో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ అనుమతులపై ప్రభుత్వం జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం అనుసరించి బిల్డింగ్ అనుమతుల జారీ చేసే విషయమై లైసెన్స్‌డ్ సర్వేలకు విధి విధానాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్ సర్వేయర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **YENDRAPU NARESH**, S/o.Yendrapu Nukaraju, Resident of D.No.13-20-42, Nallam Vari Thota, Near Nallam Vari School Gunupudi, Bhimavaram Town and Mandal, West Godavari (AP). Do here by declare that I have changed my name from **VANDRAPU NARESH** , S/o.Vandrapu Nukaraju (Old Name as per 10th and Inter Certificates) to **YENDRAPU NARESH,** S/o.Yendrapu Nukaraju (New Name) for Future all purposes.

నోటీసు

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)వారి కోర్టులో

ఐ.ఎ.నెం.882/2024 ఇన్ ఓ.యస్.నెం.46/2020

బిట్వీన్:
కురివెళ్ళ లక్ష్మీ కోటేశ్వర రావు వగైరాలు
.....పిటీషనర్లు/వాదులు
మరియు
కురివెళ్ళ వెంకట కోట నగేష్ కుమార్
...... రెస్పాండెంటు/ప్రతివాది
టు,
కురివెళ్ళ వెంకట కోట నగేష్ కుమార్, తం|డి.కృష్ణా రావు, కేరాఫ్: లక్ష్మీ మెడికల్స్,వీరవాసం(గ్రామం & మండలం) పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు శ్రీకోర్టువారి ద్వారా నోటీసులు పంపించినను మీకు ముట్టనందున శ్రీ కోర్టువారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా నోటీసు తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది.11-04-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ. గం.10.30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ,మీ అడ్వకేటు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీకోర్టు వారిచే దావా మీపరోక్షముగా విచారించి తీర్మానించబడును.

(శ్రీకోర్టువారిఉత్తర్వులప్రకారము)
వాయిదాతేది:11-04-2025

కె.వి.ఆర్.హెచ్.ప్రసాద్,
రవీంద్ర నగర్, గుంటూరు,

ప్రకటన

మహారాజశ్రీ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు వారి కోర్టులో

O.S.No.605/2014

వాది : శ్రీమతి గొర్రెల సింహాచలం
ప్రతివాదులు :
శ్రీమతి గొట్టపు సూర్యకాంతం వగైరా
టు
D3 : గొట్టపు మోహనరావు
పోతురాజు, డోరునెం.5-75,
బస్టాండ్ వద్ద, భీమడోలు.

పై నంబరు దావా 3వ ప్రతివాది గొట్టాపు మోహనరావు హాజరు నిమిత్తం ది.**1-4-2025**వ తేదీకి వాయిదా వేసినారు. కావున 3వ ప్రతివాది ది.**1-4-2025**వ తేది ఉదయం గం.10.30 గం॥లకు పైకోర్టులో స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేనిఎడల పై దావా 3వ ప్రతివాది పరోక్షంలో తీర్మానించబడును.

బి.గౌరిశంకర్
శ్రీమతి ఎ.శోభారాణి
అడ్వకేట్స్, ఏలూరు.

మహారాజశ్రీ భీమవరం కొవ్వూరు 9వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి వారి కోర్టులో

ఒ.ఎస్.నెం.46/2014

వాదులు :
1.తాడిమళ్ళ సుబ్రహ్మణ్య బ్రహ్మాజీరావు (డైడ్)
2.తాడిమళ్ళ సూర్య కుమారి దేవి
3.తాడిమళ్ళ వెంకట శ్రీరామచంద్రమూర్తి (డైడ్)
4.పెద్దాడ శ్రీవాణి
5.తాడిమళ్ళ వెంకట జ్యోతి లక్ష్మణ్
6.తాడిమళ్ళ శ్రీరామ పద్మావతి
7.తాడిమళ్ళ సుబ్రహ్మణ్య సూర్య భార్గవ్
8.తాడిమళ్ళ సుబ్రహ్మణ్య సూర్య భరత్

ప్రతివాదులు :
1.ప్రోతాప్రగడ ఉమామహేశ్వరరావు అనే మహేష్ (డైడ్)
2.ప్రోతాప్రగడ సూర్యనారాయణ
3.ప్రోతాప్రగడ సూర్యకుమారి
4.ప్రోతాప్రగడ సుబ్రహ్మణ్య మురళీకృష్ణ కుమార్
5.ప్రోతాప్రగడ ప్రసన్న

వాదుల తరపున దాఖలు చేసుకున్న పేపరు ప్రకటన

యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు పైనెంబరు దావాలోని వాదులు కొవ్వూరు 9వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి వారి కోర్టులో పై నెంబరు దావాను వారి హక్కుల నిమిత్తం దావా వేసియున్నారు. పైనెంబరు దావాలో 5వ ప్రతివాదియైన ప్రోతాప్రగడ ప్రసన్నకు శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినను ఆమె తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.వి.**26-03-2025**వ తేదీకి వాయిదా వేసినారు. మీరు సదరు తేది ఉదయం 10.30 గం.నిలకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పైదావా మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 26-03-2025

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
టి.ఎన్.వి.రమణమూర్తి, ఎమ్.గోపి
వాదుల తరపున అడ్వకేట్స్, కొవ్వూరు.
ఎస్.బెనర్జీ విజయకుమార్
కొవ్వూరు అడ్వకేట్, భీమవరం.
తేది.19-03-2025 సెల్: 9440644116.